క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

లింగాల : వెలిదండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. కర్ణపాపాయపల్లె ఫీడర్ల పరిధిలో రోడ్డు క్రాసింగ్ పోల్స్ మార్చుతున్న కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాలసంజీవులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు చర్మ వ్యాధుల వైద్య నిపుణులు రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు చర్మవ్యాధుల వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మ వ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం కూడా అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కమలాపురం సబ్ రిజిస్ట్రార్‌గా డీఎం బాషా



కమలాపురం : కమలాపురం సబ్ రిజిస్ట్రార్‌గా డీఎం బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరులో పనిచేస్తున్న ఈయన బదిలీపై కమలాపురంకు వచ్చారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌బాషా మైదుకూరుకు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు చేపట్టిన డీఎం బాషా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారికి సంబంధించి రిజిస్ట్రేషన్ సేవలను సక్రమ పద్ధతిలో అందిస్తామన్నారు. క్రయ విక్రయాలు జరుపుకునే వారు నేరుగా తనను కలవాలని, మధ్యవర్తులను నమ్మవద్దని ఆయన సూచించారు. కాగా కార్యాలయ సిబ్బంది ఆయనను కలసి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల సూపర్‌వైజర్ వసంత

సింహాద్రిపురం : గర్భిణులు చిరుధాన్యాలు తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ వసంత తెలిపారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్–7లో పౌష్టికాహార కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని, 7వ నెల నుంచి పోషకాహార అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : రక్తహీనతను నివారించేందుకు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ రమాదేవి తెలిపారు. పౌష్టికాహారం మహోత్సవాలు సందర్భంగా బుధవారం వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

లింగాల : సర్వేంద్రియానం నయనం ప్రధానమని లింగాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. బుధవారం ఎగువ లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో విద్యార్థులకు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కంటి వైద్యులు సుధాకర్‌రెడ్డి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేయడంతోపాటు కంటి అద్దాలను త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, లింగాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివరాం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లోకి చేరిన వర్షం నీరు



పోట్లదుర్తిలోని ఎన్‌టీఆర్ కాలనీలోకి చేరిన వర్షం నీరు

ఎర్రగుంట్ల : పోట్లదుర్తి గ్రామంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పంట పొలాలన్నీ నీటితో నిండిపోయ్యాయి. ఎన్‌టీఆర్ కాలనీలో రోడ్లన్నీ నీటితో మునిగాయి. చిన్నపాటి వర్షం పడినా సమీపంలోని పొలాల్లోని నీరంత కాలనీలోకి ప్రవేశిస్తుంది.

పొంచి ఉన్న ప్రమాదం

- కల్వర్టులపై సగానికే రక్షణ గోడలు
- వద్దిరాల తలమంచిపట్నం వద్ద భద్రత గాలికి



వద్దిరాల వద్ద బ్రిడ్జికి పూర్తిస్థాయిలో నిర్మించని రక్షన గోడ



తలమంచిపట్నం వద్ద కల్వర్టుపైన సగానికి పైగా ధ్వంసమైన రక్షణ గోడ

మైలవరం : ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టుల పై ఉన్న బ్రిడ్జిల వద్ద ప్రమాదం పొంచి ఉంది. వీటికి ఇరువైపుల పూర్తిస్థాయిలో ఉండవలసిన రక్షణ గోడలు సగానికే పరిమితం అయ్యాయి. బ్రిడ్జి చివరి వరకు రక్షణ గోడ ఉందని వాహనదారులు పొరపాటున అంచుకు వెళ్లితే కాలువలో పడిపోయే ప్రమా దం ఉంది. మండలంలోని వద్దిరాల, దొడియం గ్రామాల మధ్యలో ఆర్అండ్‌బీ రహదారిపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడపూర్తిస్థాయిలో లేదు. బ్రిడ్జి చివరలో పదిమీటర్ల మేర రక్షన గోడను అసలు నిర్మించలేదు. ఈ రహదారిపై ప్రతి రోజు వందలాది వాహనాలు వెళ్లుతుంటాయి. ఎదురుగా వస్తున్న పెద్ద వాహనాలకు సైడ్ ఇవ్వాలని ద్విచక్ర వాహనదారులు మరి అంచుకు వెళ్లితే కాలువలో పడినట్లే. నలవై అడుగుల లోతులో ఉన్న ఈ కాలువకు ఇటీవల పెద్ద ఎత్తున నీటిని అవుకు రిజర్వాయర్‌నుంచి గండికోట ప్రాజెక్టులోనికి వదిలారు. అయితే భారీగా నీరు ప్రవహిస్తున్న కాలువ భద్రతను మాత్రం మరిచిపోయారు. వీలైనంత త్వరగా ఈ బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడను పూర్తి స్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నెల్లూరు–బళ్లారి ప్రధాన రహదారిపై..

మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామం వద్ద రాష్ట్ర రహదారిపై చిన్న కల్వర్టును నిర్మించారు. పిన్నయ్యచెరువునుంచి పొలాలకు ఈ కల్వర్టు కింద నుంచి నీరు వెళ్లుతుంది. ఇరవై అడుగుల లోతు ఉన్న ఈ కాలువపై కల్వర్టుకు ఇరువైపుల నిర్మించిన రక్షణ గోడ ఇటీవల కాలంలో సగానికిపైగా ధ్వంసం అయింది. దానికి తోడు ఇక్కడ పాదాచారులు నడవటానికిఫుట్ పాత్ కూడలేదు. అసలే రాష్ట్ర ప్రధాన రహదారి రావడంతో రాత్రిపగలు నిత్యం వాహనాలు వెళ్లతుంటాయి. పొరపాటున రోడ్డు అంచుకు వెళ్లితే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు ఆలస్యం చేయకుండా ఇరువైపుల రక్షణ గోడను పునః నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పటికైనా అధికారుల స్పందించాలి



40 అడుగుల లోతు ఉన్న జీఎస్ఎస్ఎస్ కాలువపై వద్దిరాల వద్ద నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడను పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం విచారకరం. ప్రమాదం జరిగిన తర్వాత చింతిస్తే ఏం లాభం?. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిలపై పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మిస్తే ప్రమాదాలకు కొంతైనా అడ్డుకట్టవేసిన వారు అవుతారు.

– బండల చిన్న మహమ్మద్, చిన్నవెంతుర్ల, మైలవరం

వీలైనంత త్వరగా రక్షణగోడ నిర్మించాలి



బ్రిడ్జిలు కల్వర్టులకు ఇరువైపుల ఎక్కడైతే రక్షణ గోడలు లేవో ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి వాటని త్వరగా నిర్మిస్తే మంచింది. ముఖ్యంగా నెల్లూరు–బళ్లారి రాష్ట్ర రహదారిపై తలమంచిపట్నం వద్ద ఉన్న కల్వర్టుకు రక్షణ గోడను వీలైనంత త్వరగా నిర్మించాలి. దీని వల్ల పాదాచారులకు, ఇటు వాహనదారులకు మేలు చేసిన వారు అవుతారు.

– లింగుట్ల సుమంత్‌బాబు, తలమంచిపట్నం, మైలవరం

చంద్రబాబు తీరు దారుణం



మాట్లాడుతున్న చంద్రఓబుల్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : కడప జిల్లా పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు దారుణమని కమలాపురం మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై కోపంతో చంద్రబాబును వ్యవహరిస్తున్న వైఖరి క్షమించరానిదన్నారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఎంతో తోడ్పాటు అందించే కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ అమరావతికి తరలించడం తగదన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ హయాంలో రాయలసీమ నడిబొడ్డు అయినా కడప జిల్లాలో ఈ ప్రాంత దీర్ఘకాల కరువు తీర ప్రాంతంగా ఉన్నందున ఉపాధి అవకాశాల కోసం కొప్పర్తి మేఘ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత కొప్పర్తి పరిశ్రమల హబ్‌గా ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేస్తామని 2024–25 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌కు అనుసంధానంగా మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఎం.ఎస్.ఎం.ఈ.)ను చంద్రబాబునాయుడు రాయలసీమ వాసైనా అమరావతికి తీసుకెళ్లడం దురదృష్టకరమన్నారు. అవసరమైతే అమరావతిలో మరో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అంతేగాని కడప నుంచి అమరావతికి తరలించడం తగదన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంట



మండలంలోని పలు గ్రామాల్లో నేలకొరిగిన వరిపంట

వల్లూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటుగా తీవ్ర గాలులు వీచాయి. దీంతో నీటి వసతి వున్న రైతులు ఖరీఫ్‌లో ముందస్తుగా సాగు చేసిన వరిపంట పూర్తిగా నేల కొరిగింది. మండలంలోని పెద్దపుత్త, దుగ్గాయపల్లె, లేబాక, తప్పెట్ల తదితర గ్రామాల పరిధిలో కోత దశలో వున్న వరి పంట నేల కొరిగింది. రైతులు ఒకటి రెండు రోజుల్లో కోత కోయడానికి సిద్ధమవుతున్న తరుణంలో నేల కొరిగింది. పొలాల్లో నీరు నిలిచిన కారణంగా మరి కొన్ని రోజులు వరి కోయడానికి వీలు కాని పరిస్థితులు నెలకొన్నాయి. నేల కొరిగిన వరి పంట ధాన్యం మొలకెత్తే అవకాశాలు వున్నాయని, దీంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీవో 56ను రద్దు చేయాలి

జమ్మలమడుగు : కొప్పర్తి పారిశ్రామిక కేంద్ర నుంచి ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను తరలిస్తు తెచ్చిన జీవో 56ను రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపుతో రాయలసీమను నిర్లక్ష్యం చేస్తే రాయలసీమ ఉద్యమానికి ఆజ్యం పొసినట్లే అవుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సీఆర్‌డీఏకు తరలిస్తూ తీసుకువచ్చిన జీవో సరైంది కాదన్నారు. చంద్రబాబు వైఖరి వల్ల సీమ ప్రాజెక్టులకు నికర జలాలు దక్కలేదని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంపై వివక్ష చూపుతున్న చంద్రబాబునాయుడు ఈ ప్రాంత వాసులలో ద్రోహిగా మిగిలిపోతారన్నారు.

ఆలయ ఈఓగా రమణారెడ్డి



పులివెందుల టౌన్ : పులివెందుల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ఈఓ) రాయచోటికి చెందిన రమణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న ఆలయ ఈఓ కె.వి.రమణను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

వేంపల్లె : జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు వేంపల్లి శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు అ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన పోటీల్లో వాలీబాల్, చెస్, ఖోఖో, కబడ్డీలకు చెందిన అండర్ –14 విభాగంలో, అండర్–17లో ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

వేంపల్లె : పులివెందులలో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో ప్రతిభ కనపరచి వివిధ విభాగాలలో స్వామి వివేకానంద విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయరెడ్డి తెలిపారు. అండర్ 17 విభాగంలో యోగా పోటీల్లో ఎం.మణికంఠరెడ్డి, జూనియర్ విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఎంపికయ్యారు. ఖోఖో పోటీల నుంచి ఎం.అంజన్‌కుమార్‌రెడ్డి, బి.బాబురెడ్డిలు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగం నుంచి ఎం.దేవేంద్రారెడ్డి, కే.హరీశ్వర్‌రెడ్డిలు ఖోఖో పోటీల్లోనూ, ఎం.ప్రశాంత్‌రెడ్డి కబడ్డీ విభాగంలోనూ, బి.శ్రీహరి వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

జూదరులు అరెస్ట్

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎరుకల కాలనీలో పేకాటాడుతున్న స్థావరాలపై బుధవారం దాడి చేసి 8 మందిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.22710 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

సింహాద్రిపురం : మండలంలోని వై.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఐదు మంది జూదరులను బుధవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5820 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా ప్రజలు తెలియజేయాలన్నారు.

దుకాణంలో చోరీ

కొండాపురం : కె.సుగుమంచిపల్లె పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ప్రసాద్ దుకాణంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. దుకాణం రేకుల షెడ్ కావడంతో రేకులు తీసి రూ.2500 విలువ చేసే సిగరేట్ల ప్యాకేట్లు దొంగలించారన్నారు.

క్రీడా రంగంలోను రాణించాలి



రితికను సన్మానిస్తున్న డాక్టర్ అగస్టీన్

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడారంగంలోను రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఎ అగస్టీన్ తెలిపారు. రెండు రోజుల క్రితం వైజాగ్‌లో కుట్లు, అల్లికలపై గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రివ్యూ కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ 8వ తరగతి చదువుతున్న రితిక అనే విద్యార్థిని ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థినికి మెమెంటో, నగదు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాసప్రసాద్

పులివెందుల టౌన్ : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన స్థానిక వైవీఎంఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంవల్ల బహుళ ప్రయోజనాలు సిద్ధిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలన్నారు. కనీసం మూడు లేదా నాలుగు సంవత్సరాలపాటు వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటే అవి వృక్షాలుగా అవతరిస్తాయన్నారు. వృక్ష సంపద పుష్కలంగా ఉంటే వర్షాలు కూడా బాగా వస్తాయని, తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక ఏపీజీబీ బ్రాంచ్ కార్యాలయంలో ఇరువురు పారిశుద్ధ్య మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటగణేష్, సీనియర్ మేనేజర్ రాజేష్, అసిస్టెంట్ మేనేజర్లు ఫీల్డ్ ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నగరిగుట్టలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ

పులివెందుల టౌన్ : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. పట్టణంలోని నగరిగుట్టలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పచ్ఛదనం పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ పులివెందులకు ప్రతి ఒక్కరూ పురపాలక సంఘానికి సహకరించాలన్నారు. అనంతరం స్థానిక వారపు సంత మార్కెట్‌లో కూరగాయల, అంగళ్ల యజమానులతో మాట్లాడుతూ పాడైపోయిన కూరగాయలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తలను వేరుచేసి పురపాలక చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. కూరగాయల మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే స్థానిక ఎర్రగుడిపల్లెలో జరుగుతున్న యూజీడీ శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమాలలో ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

యువత హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ వలి

వేంపల్లె : యువత హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సురేష్‌రెడ్డి, కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ వలిలు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు హెచ్‌ఐవిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ అనేది అంటువ్యాధి కాదని.. అంటించుకొనే వ్యాధి అని వివరించారు. హెచ్‌ఐవి 2017 యాక్ట్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. యువత సత్ప్రవర్తనతో మెలగాలని బాగా చదువుకుని మంచి భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందిస్తాం

పులివెందుల రూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. మహిళలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ వెంకటేష్, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, మండల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి



కమలాపురం : వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



జంగంరెడ్డిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుత్తాకృష్ణ చైతన్యరెడ్డి

కమలాపురం : రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే విధంగా తీర్చి దిద్దడం కోసమే ప్రభుత్వం పొలం పిలుస్తోంది. కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పాచికలపాడు, సి.గోపులాపురంలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన ఆమె రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ముందుగా ఆమె క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. రబీ సీజన్‌లో సాగు చేసే మినుము, శనగ పంటల గురించి అవగాహన కల్పించారు. వరి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. పాడి పరిశ్రమ రైతులు జాగ్రత్తలు పాటించి పాల దిగుబడి పెంచుకోవచ్చన్నారు. జడ్పీఎన్ఎఫ్ స్టాఫ్ లతా కుమారి ద్రవ, ఘన జీవామృతం తయారు చేసి వాటి ప్రయోజనం గురించి వివరించారు. రైతులు తమకు పీవీసీ పైపులు, జిప్సం, జింక్ సల్ఫేట్ సబ్సీడీలో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఉలిమెల్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు రామకృష్ణారెడ్డి పొలంలో మిరప, ఉల్లి పంటలపై పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి సకాలంలో మందులు వాడటంవల్ల రైతులు మంచి దిగుబడి సాధిస్తారన్నారు. జీవామృతాన్ని అక్కడే రైతులు ముందే చేసి చూపించారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు, సుంకేసుల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి హాజరై రైతులకు పంట సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం బాలతిమయ్యగారిపల్లెలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు పాల్గొని మాట్లాడారు. పంటలకు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. మండల ఇన్‌చార్జి ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో

పెండ్లిమర్రి : మండలంలోని జంగంరెడ్డిపల్లెలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనూరాధ రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : కంది పంటలో రసం పీల్చే పురుగు ఉధృతంగా వుందని రైతులు దాని నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఉప్పలూరులో కందిపంట సాగును పరిశీలించి మాట్లాడారు. రసం పీల్చే పురుగు ఉధృతి నివారణకు తొలి దశలో 05 ఎం.ఎల్ వేపనూనె 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. వచ్చే రబీ సాగులో ప్రతి పంటకు విత్తనశుద్ధి చేసుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని ఏవో సూచించారు.

వేములలో..

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లెలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి పాల్గొని పంటలను పరిశీలించి మాట్లాడారు. పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎక్కువ పంట దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామంలో 1002 మంది రైతులు 3212ఎకరాలలో ఈ–క్రాఫ్ నమోదు చేశామన్నారు. 30వ తేదీలోపు ఇ–క్రాప్ జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తామన్నారు. మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ జయంత్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని మద్దలపాయ, పైడిపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య పాల్గొని పంటలను పరిశీలించి మాట్లాడారు. ఆధునిక పద్ధతులను రైతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏఓ శివమోహన్‌రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానికంగా బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు పాల్గొన్న రైతులకు పలు సూచనలు అందించారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది నిరంతరం మీకు అందుబాటులో ఉంటారని వారి వద్దకు వెళ్లి నూతన విధానాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఉధ్యానవన శాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మండల స్పెషలాఫీసర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కోమన్నూతల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి రమేష్, హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, పశువైద్యాధికారి సుబ్బరాయుడు, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాత్రిపూట అనుమానాస్పద స్థితిలో కనిపిస్తే చర్యలు



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ జీవన్ గంగానాథబాబు

పులివెందుల రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఎవరైనా రాత్రి సమయాలలో సంచరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసునమోదు చేస్తామని సీఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఇతర రాష్ట్రాలైన వెస్ట్‌బెంగాల్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి పులివెందుల ప్రాంతంలో పనిచేసుకుంటున్న సుమారు 64 మందిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించామని సీఐ తెలిపారు. రాత్రి 11 గంటల తర్వాత ఎవరైనా అనుమానస్పద స్థితిలో కనపడితే వారి పైన కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చోరీలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. పట్టణ ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.